# అపాత్రదానం



– రవి

## యురేకా!

## సక్సెస్!

## గ్రాండ్ సక్సెస్!

ఆనందాతిశయంతో డా. రావ్ కంఠం ఆ అపరాత్రి వేళ మోగిపోతోంది. ఆ అరపులకు పడకగదిలో నిద్రలో వున్న భార్య, స్టార్ టీవీలో ఉత్కంఠభరిత మైన ఓ సినిమా చూస్తున్న కూతురు హడలిపోయి ఒక్కసారిగా పరిగెత్తుకు వచ్చారు. అక్కడ రావు మొహం దేదీప్య మానంగా వెలిగిపోతోంది. "ఏమయిం దంటూ ప్రశ్నించినవారికి ఆయన కేకలే తిరిగి సమాధానంగా చేరాయి. ఎంతోకాలం నుంచి వ్యయప్రయాసల కోర్చి తను చేస్తున్న ప్రయోగాలు సక్సెస్ అవడమే ఆయన ఆనందానికి కారణం అని అర్థమైంది.

రావు వృత్తిరీత్యా ప్రొఫెసర్, ప్రవృత్తిరీత్యా మానవాతీత శక్తుల మీద పలు ప్రయోగాలు చేసే సైంటిస్ట్. ఎంతోకాలంగా ఆయన ఫోర్త్ డైమెన్షన్, ఆత్మలతో మాటాడడం వంటి విషయాలలో నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నాడు. ఆత్మలను సమీకరించి వాటితో మాట్లాడడం ద్వారా మానవజాతికి మేలు చేయాలనేది ఆయన సంకల్పం. ఐన్‌స్టీన్, లూయీపాశ్చర్ వంటి మహా మేధావుల ఆత్మలతో భేటీ ద్వారా జీవించి వుండగా బయల్పడని వారి మేధా సంపత్తిని బయటకు లాగి మానవశ్రేయస్సు చేయడం ఆయన పరమ లక్ష్యం. ఎట్టకేలకు రావు శ్రమ ఫలప్రదమై ఏ ఆత్మనైనా పలకరించగలగడం సాధ్యమైంది.

తెల్లవారింది. రావు ఆ రోజంతా ఆనందంగా తన ప్రయోగ వివరాలన్నీ నోట్స్ వ్రాస్తున్నాడు. ఎలాగయినా ఆ రోజే తన ప్రయోగ వివరాలన్నీ క్రోడీకరించి సాక్ష్యాధారాలతో మరునటిరోజు పత్రికలవారికి అందజేయాలనే దృక్పథంతో వున్నాడు. ఏమయితేనేం ఆ రోజు మొత్తం శ్రమించి పని పూర్తి చేసి నిద్రకుపక్రమించాడు రాత్రవుతుండడంతో.

"రావ్! డాక్టర్ రావ్!"

"లే! నిద్రపోతున్నావా?"

ఎక్కడనుండో లీలగా వినిపిస్తున్న మాటలకు రావు నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా ఏవో ఆకారాలు లీలగా కదలుతున్నాయి.

"ఎవరు మీరు, ఎందుకు వచ్చారు?" అంటూ ప్రశ్నించాడు.

"మా వివరాలు తరువాత, ప్రయోగం విజయవంతమయిందని ఆనందంగా వున్నట్లున్నావు" అన్నాయవి.

"అవును, నా జీవిత లక్ష్యం నెరవేరింది, ఒక మనిషిగా సమాజానికి ఉపకరిస్తున్నందుకు ఎంతో ఆనందంగా వుంది" రావు సమాధానం.

"నీ ప్రయోగాల వలన నీవనుకున్నట్టు ఉపకారమే జరుగుతుందనుకుంటున్నావా? బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చావా?"

"ఏం! ఎందుకు జరగదు" రావు ముఖంలో ఆశ్చర్యం.

అపుడో ఆకారం ముందుకు కదిలింది.

"నేనెవరో తెలుసా? ఆల్ఫ్రెడ్ నోబుల్, డైనమైట్ కనుగొన్నది నేనేనని నీకు చెప్పనవసరం లేదనుకుంటా. నేనూ నీలాగే దేశం, ప్రపంచం, శ్రేయస్సు అంటూ తలంచేవాడిని. సమాజశ్రేయస్సు కోసం నేను తయారుచేసిన 'డైనమైటు' నా కన్నుల ముందే దారుణంగా దుర్వినియోగమవుతుంటే, దుర్మార్గుల దుశ్చర్యలు చూడలేక ఎంత క్షోభ పడ్డానో ఊహించగలవా? నా పరిశోధనాలక్ష్యం సఫలమయిందా?" అంది.

రావు వింటున్నాడు.

మరో ఆకారం ముందుకు కదిలింది. దాని కథనం ఇలా సాగింది. "నేను లేజర్ కిరణాల ఆవిష్కర్తను. కేవలం శాంతియుత ప్రయోజనాలే నా ప్రయోగ లక్ష్యం కావాలని కోరుకున్నాను. కానీ నా లేజర్ కిరణాలను యుద్ధాలలో ఆయుధాలుగా మార్చిన నేటి మానవుల చేష్ట నాకు శాంతి లేకుండా చేసింది."

మూడో ఆకారం మాట్లాడసాగింది.

"'ఆమ్నియోసెంటెసిస్' అంటే శిశువులు పుట్టకముందే లింగ నిర్ధారణ చేయగలగడం అనే ప్రయోగ సాధనలో నా కృషి అనల్పమైనది. మా ఆలోచనలే వేరు. మేం ఆశించింది వేరు. కాని మా ప్రయోగం విజయవంతమవడమే స్త్రీ జాతికి తీరని ద్రోహమైంది. నేనూ ఓ స్త్రీనై వుండి స్త్రీ జాతికి ద్రోహం చేశాననే తలంపు నన్ను మోక్షానికి దూరం చేసింది" ఇది దాని కథ.

"అంతెందుకు 'కలనిష్‌కోవ్' కేవలం మాతృదేశ రక్షణార్థం నాజీల తుపాకులకు దీటయినదిగా వుండాలని ఎంతో ప్రయాసపడి రూపొందించిన ఎ.కె. సిరీస్ తుపాకులు తన ముందే టెర్రరిస్టుల చేతులలో మ్రోగుతుంటే తను పడుతున్న బాధను ఒక్కసారి గుర్తించు. భూమి గుండ్రంగా వుందని చెప్పిన వ్యక్తినే సజీవదహనం చేసిన కర్కశులున్నారు. సోక్రటీస్‌కి విషమిచ్చి చంపిన నరరూప రాక్షసులున్నారీ ప్రపంచంలో" అని కలసికట్టుగా చెప్పాయి.

"ఇపుడు చెప్పు! నీ ప్రయోగం వలన తప్పనిసరిగా నీవు ఆశించిన మేలే జరుగుతుందంటావా? అట్లా కాకుండా ఏ 'హిట్లర్', లేదంటే 'ముస్సోలినీ'దో ఆత్మలను రప్పించి ఎపుడో వస్తుందనే మూడో ప్రపంచ యుద్ధాన్ని ఇపుడే సృష్టించబోరంటావా? ఏ 'ఎస్కోబార్'నో రప్పించి డ్రగ్స్ వ్యాపారాన్ని, 'మాఫియా' ఉధృతం చేయదని నమ్ముతావా? నీ ప్రయోగం ఖచ్చితంగా సాధువులయిన మానవులకే ఉపయోగపడేలా నువ్వేమయినా చేయగలవా? తెలిసి తెలిసి నరరూపరాక్షసులవంటి మానవత్వం మృగ్యమయినటువంటి ఈ మనుషులకు నీ ప్రయోగాన్ని అందిస్తావా? అర్హత లోపించిన వీరికి 'అపాత్రదానం' చేస్తావా?

చెప్పు! చెప్పు! చెప్పు! "

"లేదు, లేదు" అని అరుస్తున్న రావు చల్లటి చెయ్యి ఒంటి మీద పడడంతో నిద్ర నుంచి లేచి కూర్చున్నాడు. ప్రశ్నార్థకంగా తన ముఖంలోకి చూస్తున్న తన భార్య, కూతురు వంక నిర్మలంగా చూసి, తన ప్రయోగ వివరాల ప్రతులు తగలబెట్టడం ప్రారంభించాడు ప్రొ. రావ్.